## క్లుప్తంగా

### 3 నుంచి పోలేరమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం

రాచర్ల: మండలంలోని గౌతవరం గ్రామంలో ఫిబ్రవరి 3, 4వ తేదీల్లో పోలేరమ్మ అమ్మవారి తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయల కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు పూజలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం అమ్మ వారికి అభిషేకం, అలంకరణ, హోమం, పూర్ణాహుతి అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అదే రాత్రి 9 గంటలకు బ్రహ్మం గారి నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

### కందుల కొనుగోలుకు 2 కేంద్రాలు

● పాములపాడు, మల్లవరంలో ఏర్పాటు

పొదిలి రూరల్: ఈ ఏడాది ఏపీ మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కందులు కొనుగోలు చేయనున్నట్లు వ్యవసాయాధికారి ఎస్‌కే జైన్‌లాబ్దీన్ తెలిపారు. ముందుగా కందులు పండించిన రైతులందరు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7550గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మాదాలవారిపాలెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో పాములపాడులో, ఉప్పలపాడు రామలింగేశ్వర పీఏసీఎస్ ఆధ్వర్యంలో మల్లవరంలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

### ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈఓలు

కంభం: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన వ్యక్తి ప్రధానోపాధ్యాయుడు రసూల్ బేగ్ అని మండల విద్యాశాఖాధికారులు మాల్యాద్రి, శ్రీనివాసులు కొనియాడారు. స్థానిక పార్కు వీధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రసూల్ బేగ్ మాట్లాడుతూ.. నేటి నుంచి బడికి దూరం కావాల్సి వస్తోందని ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం ఆయనను ఎంఈఓలు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతరం విద్యార్థులు ఊరేగింపుగా ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు పలికారు.

### పీఎం జన్‌మన్ గృహాలు వేగంగా నిర్మించుకోవాలి

● హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ ప్రసాద్

మార్కాపురం: పీఎం జన్‌మన్ పథకం కింద చెంచులు, గిరిజనులకు మంజూరైన గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలని హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని జమ్మనపల్లి, పెద్దనాగులవరం గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన 15 గృహాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ పథకం కింద ఎస్టీలకు మాత్రమే గృహాలను మంజూరు చేసినట్లు తెలిపారు. దోర్నాలలో 198, పెద్దారవీడులో 14, పుల్లలచెరువులో 238, యర్రగొండపాలెంలో 179, మార్కాపురంలో 15 గృహాలను మంజూరు చేశామని వివరించారు. బేస్‌మెంట్ లెవెల్ నుంచి శ్లాబ్ లెవెల్ వరకూ త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు స్పష్టం చేశారు. ఆయన వెంట మార్కాపురం హౌసింగ్ డీఈ పవన్‌కుమార్, యర్రగొండపాలెం డీఈ సురేష్‌బాబు, ఏఈ నిర్మల్ బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

### వాహనదారులపై 76 కేసులు నమోదు



జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ ఎస్సై అహరోన్

మార్కాపురం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణిస్తున్న టూవీలర్స్ యజమానులు, ఆటో డ్రైవర్లపై గత రెండు రోజుల్లో 76 కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై అహరోన్ తెలిపారు. మైనారిటీ తీరని పిల్లలకు కొందరు తల్లిదండ్రులు తమ వాహనాలు ఇస్తున్నారని, అటువంటి వారికి జరిమానా వేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు.

# నాడు పచ్చ కుతంత్రం.. నేడు తారక మంత్రం

● భూముల రీసర్వేపై 'కూటమి' యూటర్న్
● ఎన్నికల సమయంలో తీవ్ర స్థాయిలో విషప్రచారం
● భూములు గుంజుకుంటారంటూ రైతులకు అడ్డగోలుగా ఐవీఆర్‌ఎస్ కాల్స్
● నాడు బాబు అండ్ కో వద్దన్న కార్యక్రమం నేడు యథావిధిగా అమలు
● మార్కాపురం డివిజన్‌లో మళ్లీ రీసర్వే ప్రారంభించిన ప్రభుత్వం
● విస్మయం వ్యక్తం చేస్తున్న రైతులు



బేస్తవారిపేట మండలం ఒందుట్లలో రీసర్వే చేస్తున్న అధికారులు

బేస్తవారిపేట: భూముల సరిహద్దు వివాదాలు పరిష్కరించడంతోపాటు శాశ్వత హక్కులు కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భూముల రీసర్వే ప్రారంభించిన సంగతి తెలిసిందే. వందేళ్ల తర్వాత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూముల రీ సర్వేపై నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు అండ్ కో, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేయని రోజంటూ లేదు. అధునాతన సాంకేతికత సాయంతో సర్వే చేస్తున్న సమయంలో ప్రజలకు అడ్డగోలుగా ఐవీఆర్‌ఎస్ కాల్స్ చేసి జగన్ భూములు లాగేసుకుంటారని విషం చిమ్మారు. ఎన్నికల అనంతరం గద్దెనెక్కిన చంద్రబాబు భూముల రీసర్వేను రద్దు చేస్తున్నట్లు సంతకాలు కూడా చేశారు. కానీ రోజుల వ్యవధిలోనే భూముల రీసర్వేపై చంద్రబాబు ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. వాస్తవానికి నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. ఈ మేరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేకు రూ.200 కోట్లు ప్రోత్సాహక నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఇటీవల కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా వెల్లడించారు. రీసర్వే చేపడితేనే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రుణాలపై రైతులకు ఇచ్చే వడ్డీ రాయితీ విడుదల చేస్తామని కేంద్రం స్పష్టం చేసిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దిగిరాక తప్పలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేపై సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన, బీజేపీ నేతలు, ఎల్లో మీడియా విపరీతమైన దుష్ప్రచారం చేశారు. రైతులను భయభ్రాంతులకు గురిచేశారు. రీసర్వేపై రైతులు, ప్రజల్లో అనేక సందేహాలు లేవనెత్తారు. అప్పట్లో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల బహిరంగ సభల్లో సమగ్ర భూసర్వేపై.. 'తమ్ముళ్లూ మీ భూములను జగన్ లాగేసుకుంటున్నాడు.. కూటమిని గెలిపిస్తే భూ సర్వేను రద్దు చేస్తాం.. మీ భూములను కాపాడుతాం' అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించారు. ఏ సర్వేను అయితే రద్దు చేస్తామని నాడు చెప్పారో అదే సర్వేను నేడు కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రారంభించడంపై ప్రజలు, రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం డివిజన్‌లో 13 మండలాల్లో మండలానికి ఒక్కో గ్రామంలో దాదాపు 3418 సర్వే నంబర్లలో భూసర్వే చేస్తున్నారు.

#### వందేళ్ల తర్వాత సర్వే..

రైతులు ఎన్నో ఏళ్లుగా భూసమస్యలు ఎదుర్కొంటున్నారు. భూమి ఒకరిది అయితే మరొకరి పేరున రికార్డులో నమోదు కావడం, సర్వే నంబర్లలో తప్పులు, సరిహద్దుల సమస్య, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికావడం వంటి అనేక సమస్యలు ఉన్నాయి. భూ సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమగ్ర భూముల రీసర్వేను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించింది. ఇంతకు ముందు ఏ ప్రభుత్వం ఇంతటి మహోన్నతమైన కార్యక్రమం గురించి ఆలోచన చేయలేదు.

#### గత పాలనలో..

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం పేరుతో మొదటి విడత సమగ్ర భూరీ సర్వేను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. మూడు దశల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. వందల సర్వే బృందాలతో అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లతో సర్వే చేపట్టారు. మొదటి విడతగా ప్రతి మండలంలో కొన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం రీసర్వే పూర్తి చేసింది. భూసర్వేపై ఎన్నికల నోటిఫికేషన్ ముందు నుంచే కూటమి నేతలు రైతులు భయపడేలా విషప్రచారం చేశారు. తీవ్ర స్థాయిలో వ్యతిరేకించిన కూటమి నేతలు ఇప్పుడు ఏపీ భూసర్వే పేరుతో యథావిధిగా సర్వే చేస్తుంటే కిమ్మనడం లేదు.

**రీ సర్వే చేస్తున్న గ్రామాలు**

| మండలం | గ్రామం |
|---|---|
| గిద్దలూరు | తమ్మలపల్లె |
| బేస్తవారిపేట | ఒందుట్ల |
| అర్ధవీడు | అయ్యవారిపల్లె |
| కొమరోలు | నాగిరెడ్డిపల్లె |
| రాచర్ల | చోళ్లవీడు |
| కంభం | హజరత్‌గూడెం |
| మార్కాపురం | కృష్ణాపురం |
| దోర్నాల | చిన్న దోర్నాల |
| పెద్దారవీడు | ప్రగల్లపాడు |
| పుల్లలచెరువు | చాపలమడుగు |
| త్రిపురాంతకం | గొల్లపల్లి |
| యర్రగొండపాలెం | రామచంద్రాపురం |

# 35 వార్డులకు 2 ఫాగింగ్ మిషన్లేనా?



సమస్యలను సభ దృష్టికి తెస్తున్న వైస్ చైర్మన్ ఇస్మాయిల్, కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ

● మార్కాపురంలో పారిశుధ్య లోపంపై కౌన్సిలర్ల ఆగ్రహం
● ఫాగింగ్ చేయకుండా ఆయిల్ ఎలా ఖర్చవుతోందని ప్రశ్న
● కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు 18 మందిని ఒకేసారి తీసుకోవడంపై అభ్యంతరం
● పనులు చేస్తున్న దశలో 45 కాంట్రాక్ట్ వర్కును రద్దు చేయడంపై మండిపాటు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి పారిశుధ్యం అధ్వానంగా తయారైందని, ఫాగింగ్ చేయకపోవడంతో దోమల ఉధృతి పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, పలువురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. శుక్రవారం అమరజీవి పొట్టిశ్రీరాములు సమావేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో 35 వార్డులుంటే కేవలం 2 మిషన్లతో ఫాగింగ్ చేస్తున్నారని, మరికొన్ని ఫాగింగ్ మిషన్లు తెప్పించి పట్టణంలో దోమల ఉధృతిని తగ్గించాలని కోరారు. ఫాగింగ్ చేయకపోయినా ఆయిల్ ఖర్చులు భారీగా చూపుతున్నారని, ఆ డబ్బంతా ఎక్కడికి పోతోందని ప్రశ్నించారు. వార్డుల్లో గత ప్రభుత్వంలో కాంట్రాక్టు వర్కులను ఆమోదించి కొంత మేర పనులు చేశారని, వాటిని దృష్టిలో ఉంచుకోకుండా సుమారు 45 వర్కులను రద్దు చేయడం ఏమిటని మండిపడ్డారు పట్టణంలో రోడ్ల వెంట ఆక్రమణలను కూల్చిన అధికారులు ఆ వ్యర్థాలను తొలగించకపోవడంతో కాలువల్లో మురుగు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. 10వ సచివాలయం పరిధిలో శానిటేషన్ సెక్రటరీ పారిశుధ్య విధులను సక్రమంగా నిర్వహించడం లేదని, ఇప్పటి వరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కనిపించిన దాఖలాలు లేవన్నారు.

= పురపాలక సంఘంలో కాంట్రాక్టు కార్మికులను 18 మందిని విధుల్లోకి తీసుకుంటున్నట్లు ఆమోదం కోసం అజెండాలో ఉంచడం సరికాదని, చనిపోయిన వారు, వారి పిల్లలు మినహా కొత్తవారిని ఏ విధానంపై తీసుకుంటున్నారో తెలపాలని కౌన్సిలర్ ఎం.శ్రీనివాసులు ప్రశ్నించారు. ఒకేసారి ఇంత మంది విధులకు ఎలా గైర్హాజరవుతారని, కార్మికుల పొట్టగొట్టి కూటమి నాయకులు తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ అంశాన్ని ఆమోదించినట్లయితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

సభ్యుల ప్రశ్నలపై కమిషనర్ నారాయణరావు స్పందిస్తూ.. గతంలో ప్రతి రెండు వార్డులకు ఒక ఫాగింగ్ మిషన్ ఉండేదని, తాను విధుల్లో చేరే సమయానికి రెండు మాత్రమే ఉన్నాయన్నారు. మిగిలిన వాటిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. కౌన్సిల్ ఆమోదం పొందిన కాంట్రాక్టు వర్కుల్లో 25 శాతం కంటే తక్కువ చేసిన వాటిని రద్దు చేశామని చెప్పారు. మున్సిపల్ పాఠశాలలు విద్యాశాఖలో సుమారు సంవత్సర కాలం క్రితమే విలీనం అయ్యాయని, ఆ మేరకు ఉర్దూ పాఠశాలపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసన్, అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఉర్దూ పాఠశాలల సమస్య పరిష్కరించాలి**

మార్కాపురం 2వ వార్డులో ఉన్న ఉర్దూ పాఠశాలను తెలుగు మీడియం స్కూల్లో అనుసంధానం చేయవద్దని ఎస్ఎంసీ చైర్మన్ షేక్ ఖాశింబాషా, వైస్ చైర్మన్ ఎస్‌కే రుబీనాతోపాటు మరి కొందరు వినతి పత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ఉర్దూ పాఠశాలలో 1 నుంచి 5 వరకు విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉర్దూ పాఠశాలలను సమీపంలోని తెలుగు మీడియం పాఠశాలలో అనుసంధానం చేస్తున్నారని తెలిసిందని, మున్సిపాలిటీ తరుపున విద్యాశాఖాధికారులకు సిఫార్సు చేసి అనుసంధానం చేయకుండా ఆపాలని విన్నవించారు.

# రథసప్తమి వేడుకలు విజయవంతం చేయండి

● భక్తులు వేలాదిగా వస్తున్నందున తగిన ఏర్పాట్లు చేయాలి
● ట్రాఫిక్ మళ్లింపు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
● అధికారులతో సమీక్షలో సబ్ కలెక్టర్ త్రివినాగ్



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన ఎమ్మెల్యే కందుల తదితరులు

మార్కాపురం: ఈనెల 4న మార్కాపురం పట్టణంలో నిర్వహించనున్న రథసప్తమి వేడుకలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, వైద్యారోగ్య శాఖ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 4వ తేదీ ఉదయం 5 గంటల నుంచి శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవస్వామి వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారన్నారు. సాయంత్రం రథోత్సవానికి వేలాది మంది భక్తులు హాజరవుతున్న దృష్ట్యా అన్ని శాఖల అధికారులు ఉత్సవం ముగిసే వరకూ పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. రథోత్సవం సమయంలో ట్రాఫిక్ మళ్లింపు, పారిశుధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

ఈఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. సమీక్షలో కమిషనరు నారాయణరావు, ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, తహసీల్దార్ చిరంజీవి, విద్యుత్ డీఈ షియానాయక్, ఆర్టీసీ డీఎం నరసింహులు, రథోత్సవ కమిటీ ప్రతినిధులు యక్కలి కాశీవిశ్వనాథం, ఆలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### యూనిఫామ్ సివిల్ కోడ్ రాజ్యాంగ విరుద్ధం

మార్కాపురం టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వాల రాజ్యాంగ విరుద్ధమైన చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఎంపీజే(మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె అబ్దుల్‌రజాక్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీజే కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాఖండ్‌లో యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ) అమలు చేయడం దురదృష్టకరమన్నారు. కోట్లాది మంది ముస్లింల అభిప్రాయాలు, మనోభావాలు, విపక్ష సభ్యుల సూచనలను పట్టించుకోకుండా జేపీసీ రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించిందని ధ్వజమెత్తారు. షరియత్ అప్లికేషన్ చట్టం ఇస్లాంలో అంతర్భాగమని పేర్కొన్నారు. యూనిఫాం సివిల్ కోడ్‌ను రూపొందించే అధికారం ఏ రాష్ట్రానికీ లేదని చెప్పారు. యూసీసీని అంగీకరించేంది లేదని గతేడాది జూలైలో ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు, బౌద్ధులు, దళితులు, ఆదివాసీ సంఘాలన్నీ స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అన్ని వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న యూసీసీని కేంద్ర ప్రభుత్వం మొండిగా అమలు చేయడం సరైన చర్య కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

### మొక్కల పెంపకంతో ఆహ్లాదకర వాతావరణం

గిద్దలూరు రూరల్: అమృత్ సరోవర్ కింద ఉపాధీ హామీ నిధులతో చేపడుతున్న పనులతో ప్రతి గ్రామంలో ఆహ్లాదకరమైన వాతవరణం కల్పించాలని డ్వామా పీడీ జీ.జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బేస్తవారిపేట క్లస్టర్ పరిధిలోని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో అగ్రిఅలైడ్ పనులకు పెద్దపీట వేయాలన్నారు. 2025–26 సంవత్సరానికిగాను లేబర్ బడ్జెట్ ప్రకారం పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ భాస్కర్‌రావు, ఏపీఓలు రమణి, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత



కొమరోలు : కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మార్కాపురం టౌన్: వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా శుక్రవారం మార్కాపురం పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 8 గంటలకు కోనేటి నుంచి కలశాలను తెచ్చారు. అభిషేకం అనంతరం లక్ష లలిత సహస్ర నామ పారాయణం, కుంకుమపూజ, హోమాలను భక్తులతో అర్చకులు నిర్వహించారు. రాత్రి అమ్మవారి నగరోత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలు అందించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఎస్వీ సుబ్బారావు, కోశాధికారి రమడుగు వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపెంట వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# చెడు వ్యసనాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న జడ్జి ఎ.ఓంకార్

గిద్దలూరు రూరల్: చెడు వ్యసనాలకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ పేర్కొన్నారు. పట్టణంలోని సాయి దీప్తి ఒకేషనల్, రాజు పారామెడికల్ కళాశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. చదువుకోవాల్సిన సమయంలో సమయాన్ని వృథా చేసుకోవడం వల్ల బంగారు భవిష్యత్తును చేతులారా మీరే నాశనం చేసుకున్నవారవుతారన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ జీవితాన్ని ఆనందదాయకం చేసుకోవాలని సూచించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. 14 ఏళ్ల వయసులోపు పిల్లలందరూ తప్పకుండా బడికి వెళ్లి చదువుకోవాలన్నారు. బాలలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గిద్దలూరు సబ్ జైలును న్యాయమూర్తి తనిఖీ చేశారు. ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక వసతులపై జైలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పారా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# పశు పోషణలో జాగ్రత్తలు అవసరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న బేబిరాణి

పొదిలి: కుటుంబానికి ఆదాయం తెచ్చిపెట్టే పశువుల పోషణలో తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబిరాణి సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెంలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని ఆమె పర్యవేక్షించారు. 97 దూడలు, 100 గేదెలు, 1850 గొర్రెలకు నట్టల నివారణ మందు, 30 గేదెలకు గర్భకోశ నివారణ మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు పి.వేణు, కాకర్ల పశు వైద్యాధికారి యు.కృష్ణమోహన్, గోపాలమిత్ర జి.రాంబాబు, రాఘవ, శివ, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

**గనివానిపాడులో..**

కొనకనమిట్ల: మండలంలోని గనివానిపాడు గ్రామంలో శుక్రవారం పశు వైద్యాధికారిణి అమూల్య ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడంతోపాటు గేదెలకు చూడి పరీక్షలు, నాచు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ సాంబ వెంకటేశ్వర్లు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ పూర్ణ చంద్ర, నాగార్జునరెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### రేపు మార్కాపురంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

తర్లుపాడు: శ్రీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఎస్.శివప్రసాద్, ఎం.వెంకటేశ్వరరెడ్డి, డి. నబీ, వై.లక్ష్మీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 7 నుంచి 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్విజ్ పోటీలు రెండు దశల్లో ఉంటాయని మొదటి దశలో రిజిస్టర్ చేసుకున్న అందరికీ 50 ప్రశ్నలతో ఓఎంఆర్ పద్ధతిలో రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన మొదటి ఆరు జట్లకు రెండో దశలో నాలుగు రౌండ్లుగా మౌఖిక క్విజ్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. గణితం, సైన్సు అంశాలపై ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలను ఉపాధ్యాయుడు కె.పరమేశ్వర్ అందిస్తారని పేర్కొన్నారు.